నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 168 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
06-05-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4

# దశాబ్దాల స్వప్నానికి నాంది..
# దక్షిణ కోస్తా రైల్వేకు గ్రీన్ సిగ్నల్

- విశాఖ రైల్వే జోన్‌పై గెజిట్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం
- కూటమి కృషితో విశాఖ రైల్వే జోన్ సాధ్యం
- రైల్వే జోన్ ప్రక్రియను వేగవంతం చేసి గెజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వానికి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు




**నవతరం - నిమ్మాడ**

విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంతో ఉత్తరాంధ్రుల కలలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే నుంచి కొన్ని ప్రాంతాలను కలిపి దక్షిణ కోస్తా రైల్వే. గెజిట్ విడుదల చేయడంతో.. ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగం కానుందని అన్నారు. ఆ..రోజు ఎన్నికల హామీలను నిలుపుకునే ప్రయత్నంలో, గత ప్రభుత్వం చేయని విధంగా, చేయలేని విధంగా కూటమి ప్రభుత్వం పనిచేసి, కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి అనుకున్నది సాధించిందని హర్షం తెలిపారు. విధాన సంబంధ నిర్ణయాలలో భాగంగా పలాస - ఇచ్ఛాపురం సెక్షన్ ను విశాఖ డివిజన్ కు బదిలీ చేయడం..ఇచ్ఛాపురం - దువ్వాడ - విజయనగరం సెక్షన్ ను విశాఖ డివిజన్ కు బదిలీ చేయడం, నుప్పాడ-పర్లాకిమిడి, బొబ్బిలి-సాలూరు సెక్షన్లను విశాఖ డివిజన్ కు బదిలీ చేయడం సింహాచలం వడ్లపూడి, విశాఖ జగ్గయ్యపాలెం విశాఖ డివిజన్..కు కలుపుతూ విలీనం చేయడం బాగుందని అభిప్రాయపడ్డారు. కోరాపుట్ - కిరండోల్ లైన్ ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించడం, రాయగడ నుంచి విడదీసి విశాఖ డివిజన్ (463 కిలోమీటర్ల మేరకు) కు కలుపుతూ దక్షిణ కోస్తాలో విలీనం చేయడం కూడా బాగుందని తెలిపారు. ఆరిలోవలో దక్షిణ కోస్తా రైల్వే శాశ్వత కార్యాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఎంతో మంచి పరిణామం అని పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ డెక్‌లోని రెండు అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్వే జీఎం తాత్కాలిక కార్యాలయం జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించడానికి రంగం సిద్ధం అవుతున్న నేపథ్యంలో సంబంధిత కార్యవర్గానికి తాను శుభాకాంక్షలు చెబుతున్నానని అన్నారు. వెనుకబడిన ప్రాంతపై మరింత శ్రద్ధ వహించిన కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు ఎంతో కృషి చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును అభినందించారు.

## గ్లోబల్ స్థాయిలో పోటీ పడే సత్తాను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించారు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు







**నవతరం - పాతపట్నం**

ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖలో విప్లవాత్మక మార్పుల ప్రభావం.. తాజా పదవ తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం నాడు పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన పాతపట్నం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుండి వర్చువల్‌గా పాల్గొన్నారు. విద్యార్థులకు, తల్లితండ్రులకు, ఉపాధ్యాయ వర్గానికి శు భాకాంక్షలు. తెలపడంతో పాటు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. మండలాల వారిగా టాపర్లను పేర్లతో పలకరిస్తూ వారిలో మరింత ఉత్సాహాన్ని నింపారు.

పాఠశాలల విద్యలో సమూల మార్పులు చేసి, కార్పొరేట్ ఫలితాలకు తలదన్నే స్థాయిలో విజయాలు సాధించిన విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపారు. వారికి అందిన వసతులు, నాణ్యమైన విద్య గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆ శాఖలో విప్లవాత్మక

-మిగతా 2లో

## నరసన్నపేటలో జిల్లా కలెక్టర్, ఎస్పీ సుడిగాలి పర్యటన

# సీఎం పర్యటనకు సర్వం సిద్ధం చేయాలి

**నవతరం -నరసన్నపేట**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 16వ తేదీన జిల్లాకు రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లలో ఏమాత్రం లోటుపాట్లు ఉండకూడదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సమయం తక్కువగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియాలతో కలిసి కలెక్టర్ పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జమ్ము, అలాగే ఎస్వీఎల్ మిల్లు వద్ద చర్మాల చెరువు సమీపంలో బహిరంగ సభ నిర్వహణకు ప్రతిపాదించిన స్థలాలను వారు నిశితంగా తనిఖీ చేశారు. అలాగే, తామరాపల్లి వద్ద గతంలో ఉన్న హెలిపాడ్‌కు తక్షణమే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



పర్యటనలో భాగంగా పైడితల్లి అమ్మవారి ఆలయం సమీపంలోని 'చెత్త నుంచి సంపద' కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, కంబకాయ రోడ్డులోని స్క్రాప్ దుకాణం, ప్రైవేటు ప్లాస్టిక్ గ్రేడింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కార్మికులతో ముచ్చటించి, వారి సమస్యలను, వారికి అందుతున్న వేతనాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నరసన్నపేట పట్టణం పరిశుభ్రంగా కనిపించాలి. వీధుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పక్కా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేయగా, జాయింట్ కలెక్టర్ ఆయా శాఖలు పూర్తి చేయాల్సిన పనులపై పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, డీఎస్పీ డి. లక్ష్మణరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమాధన్ సమరో సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

- సుప్రీంకోర్టులో ఆగస్టు 21, 22, 23 తేదీల్లో
- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

**నవతరం -శ్రీకాకుళం**



సమాధన్ సమరో-2026 సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించబడునని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా మంగళవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్ ఆగస్టు 21, 22, 23 తేదీల్లో సుప్రీంకోర్టులోనే నిర్వహించబడుతుందన్నారు. సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్న కేసులు లోక్ అదాలత్ లో సెటిల్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పెండింగులో ఉన్న కేసులు ప్రమాదాలకు సంబంధించి క్లయింలు, చెక్ బౌన్స్ కేసులు, భూ సేకరణ సమస్యలు, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, కార్మికులకు సంబంధించిన సమస్యలు, తదితరులు కేసులు సుప్రీంకోర్టులో ఉన్న కేసులు పరిష్కరించుకోవచ్చున్నారు. పెండింగులో ఉన్న కేసులు సుప్రీంకోర్టు లోక్ అదాలత్ కు సంబంధించి గూగుల్ ఫార్మ్ (htts://ww.sci.gov.in), జిల్లా కోర్టు వెబ్ సైట్ లో లోక్ అదాలత్ ఫార్మ్ ఉంచినట్లు చెప్పారు. పార్టీలు తమ అంగీకారంను తెలియజేయాల్సి ఉందన్నారు. పార్టీలు వారి అడ్వకేట్లతో జిల్లాలో మాత్రమే హాజరు కావచ్చున్నారు. పార్టీలు వారి సంబంధిత అడ్వకేట్లతో డిఎల్ఎస్ఏ నిర్వహించే సెటిల్ మెంట్ సమావేశాలకు ప్రత్యక్షంగా లేదా వర్చువల్‌గా హాజరు కావచ్చున్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 15100, 08942-224675, 9440901060 సంప్రదించాలన్నారు.

## తమిళనాట దళపతి విజయ్ కొత్త అధ్యాయం

వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు

2లో



# ప్రయాణ సమయంలో హెల్మెట్ ధారణ తప్పనిసరి



- కాశీబుగ్గ డీఎస్పీ టి భవాని
- కాశీబుగ్గలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ
- అభయం హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమం

2లో

ఎడిటోరియల్

# నవ్విపోదురుగాక....

పెద్దనోట్ల రద్దు విప్లవాత్మక సంస్కరణగా రేపు విద్యార్థులకు పరిచయం చేయనున్నారు. నిజానికి ఆ నిర్ణయం దేశ అసంఘటిత రంగాన్ని తీవ్ర విధ్వంసం చేసింది. చిన్న తరహా పారిశ్రామిక రంగం స్తంభించింది. కోట్లాది మంది జీవనోపాధి దెబ్బతిన్నది. నల్లధనాన్ని వెలికితీయడం, విదేశీ బ్యాంకుల నుంచి ఆ మొత్తాలను వెనక్కి రప్పించడం, తీవ్రవాదానికి నిధులు అందకుండా చేయడం, ఆర్థిక వ్యవస్థల్లో నగదు చెలామణిని తగ్గించడమన్నవి. ఈ వినాశకర నిర్ణయాన్ని సమర్థిస్తూ పేర్కొన్న లక్ష్యాలు. కానీ వీటిల్లో ఏ ఒక్కటీ నేటికీ నెరవేరకపోగా దీనికి విరుద్ధంగా పెద్ద నోట్ల రద్దు సందర్భంగా ప్రజల్లో చెలామణిల్లో ఉన్న నగదు కంటే రెండింతలు పెరిగిందని ఆర్బీఐ గతంలోనే చెప్పింది. మరి దీని నుంచి విద్యార్థులు నేర్చుకోవాల్సిందేమిటి?

చరిత్ర లేనివాళ్లు చరిత్రను వక్రీకరిస్తారు. తాము లేని చరిత్రల్లోకి తామే అధినాయకులైనట్టు అడ్డదారిన జొర్లబడతారు. ఇందుకు అడ్డొప్పే అసలు చరిత్రను తొలగించే దుష్కృత్యానికి తెరిస్తారు. పాఠ్య పుస్తకాల కాషాయీకరణ, చరిత్ర వక్రీకరణ రెండు దశల్లో జరుగుతోంది. నిజ చరిత్రకు మసిపూయడం, తగ్గించటం, తొలగించటం మొదటి దశ అయితే.. తాము లబ్ధి పొందే అంశాలను పుస్తకాల పుటల్లోకి ఎక్కించటం రెండో దశ. ఆ రెండు దశలను దాటుకొని ఇప్పుడు మూడో దశకు చేరుకుంది. కొందర్లు నరేంద్ర మోడీ అభిమానుల ప్రభు భక్తి ఇప్పుడు విద్యా సంస్థలకు కూడా పాకడంతో ఆయన తత్వమే ఇప్పుడు యూనివర్సిటీ పాఠ్య ప్రణాళికగా మారింది. మోడీ తత్వం, ఆరెస్సెస్ చరిత్ర అంశాలను గుజరాత్, వడోదరలోని మహారాజ సయాజీరావు యూనివర్సిటీ సోషియాలజీ పీజీ కోర్సుల్లో పాఠ్యాం శాలుగా చేర్చింది. "నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు" అన్నట్టు ఉంది ఆ విశ్వవిద్యాలయం తీరు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శాస్త్రీయ భావాలకు బదులు అశాస్త్రీయ భావాలను ఎక్కువగా విస్తరింప చేస్తున్నదనడానికి ఇదొక తాజా ఉదాహరణ నేషనల్ సైన్స్ కాంగ్రెస్ లోనే కౌరవులు కుండల్లో పుట్టారని, అదే 'టెస్ట్ ట్యూబ్ బేబీ' అని ప్రచారం చేయడం. విమానాన్ని రైట్ సోదరులు కనిపెట్టక ముందే పుష్పక విమానం' ఉండేదని అందులో ఎంతమంది ఎక్కినా ఇంకొకరికి చోటు ఉంటుందని వీరు సెలవిస్తారు. శివుడు వినాయకునికి ఎనుగు తల్ల పెట్టాడని అదే 'ప్లాస్టిక్ సర్జరీ' అని అంటారు. ఇదే మోడీ తత్వం!. ఈ తత్వాన్ని ఇప్పుడు విద్యార్థులు చదువుకొని అపరమేధావులు కావాలా? విశ్వవిద్యాలయ అధికారుల ప్రభుభక్తికి విద్యార్థులు బలికావాలా?

పాఠ్య పుస్తకాల్లో తనకు అనుకూల మైన మార్పులను చొప్పించే పనిని మోడీ ప్రభుత్వం చాలా కాలంగా చేస్తోంది. ఎప్పటికప్పుడు విద్యావేత్తలు, మేధావుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా వాటిని లక్ష్యపెట్టకుండా ముందుకెళు తోంది. ఉన్నత విద్యా సంస్థల ముఖ్య స్థానాల్లో ఆరెస్సెస్ నేపథ్యమున్న వ్యక్తులను కూచోబెట్టి, పాఠ్య పుస్తకాలను కాషాయీ కరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుల్లో భాగంగానే ఎన్‌సిఈఆర్‌టి పాఠ్య పుస్తకాల్లో మత సామరస్యాన్ని బోధించే పాఠాలను ఒకటొక్కటిగా అటకెక్కించారు. డార్విన్ జీవపరిణామంతో సహా భగత్సింగ్ భావాలను మత వివక్ష గురించి పూలే, అంబేద్కర్ చెప్పిన సంగతులను పాఠాల్లోంచి తొలగించారు. ప్రపంచమంతా సైన్సు నమ్ముకుని పరిశోధన చేస్తుంటే.. మన పాలకులు మాత్రం అశాస్త్రీయ ఆలోచనల చట్రంలో ప్రజలను బంధించే పనిని చాలా ఆత్మవిశ్వాసంతో చేస్తున్నారు. తాజాగా అవీఇవీ తొలగించడం ఎందుకని ఏకంగా ఆరెస్సెస్ భావజాలాన్ని నేరుగా ఒక కోర్స్ గా ప్రారంభిస్తున్నట్టు విశ్వవిద్యాలయం చెప్పడం శోచనీయం.

పెద్దనోట్ల రద్దు విప్లవాత్మక సంస్కరణగా రేపు విద్యార్థులకు పరిచయం చేయనున్నారు. నిజానికి ఆ నిర్ణయం దేశ అసంఘటిత రంగాన్ని తీవ్ర విధ్వంసం చేసింది. చిన్న తరహా పారిశ్రామిక రంగం స్తంభించింది. కోట్లాది మంది జీవనోపాధి దెబ్బతిన్నది. నల్లధనాన్ని వెలికితీయడం, విదేశీ బ్యాంకుల నుంచి ఆ మొత్తాలను వెనక్కి రప్పించడం, తీవ్రవాదానికి నిధులు అందకుండా చేయడం, ఆర్థిక వ్యవస్థల్లో నగదు చెలామణిని తగ్గించడమన్నవి. ఈ వినాశకర నిర్ణయాన్ని సమర్థిస్తూ పేర్కొన్న లక్ష్యాలు. కానీ వీటిల్లో ఏ ఒక్కటీ నేటికీ నెరవేరకపోగా దీనికి విరుద్ధంగా పెద్ద నోట్ల రద్దు సందర్భంగా ప్రజల్లో చెలామణిలో ఉన్న నగదు కంటే రెండింతలు పెరిగిందని ఆర్బీఐ గతంలోనే చెప్పింది. మరి దీని నుంచి విద్యార్థులు నేర్చుకోవాల్సిందేమిటి?

మన దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి పాఠాన్ని పక్కన పడేశారు. కానీ, మోడీతత్వం పేరుతో విద్యార్థుల ఆలోచనలను కలుషితం చేసే బృహత్ కార్యానికి శ్రీకారం చుట్టారు. ఏకంగా " మ్యాక్స్ వెబర్స్ మహాత్మాగాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ వంటి మహానాయకుల నాయకత్వ లక్షణాలకు మోడీ ఏమాత్రం తీసిపోరని, డిజిటల్ జాతీయవాదం, పౌరసత్వం, వారసత్వం, ప్రపంచీకరణ, ఉద్యమాలను మోడీ కోణంలో చూపిస్తూ మోడీతత్వాన్ని విద్యార్థులకు బోధిస్తాం." అంటున్న విశ్వవిద్యాలయ అధికారుల ప్రభుభక్తికి జోహర్లు పలకాల్సిందే.

ఏ వివక్ష, పక్షపాతం లేని పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యార్థుల్లో తప్పుడు భావాలు నాటే దిశగా కోర్స్ రూపకల్పన జరుగుతూ ఉంది. విద్యార్థుల నెత్తిన తను పథకాల ప్రచారం మోపే కుయుక్తి కూడా ఇందులో భాగమే! అహేతుకం, అశాస్త్రీయం, అసత్యాలతో కూడిన కోర్సులను విశ్వవిద్యాలయాలలో ప్రవేశపెడితే రేపటి పౌరులు ఎలా తయారవుతారు? ఇది ఆందోళన కలిగించే పరిణామం. దీన్ని వ్యతిరేకించటం ఆలోచనాపరులందరి కర్తవ్యం.

# తమిళనాట దళపతి విజయ్ కొత్త అధ్యయం

నవతరం -పలాస

హీరో అంటే విజయ్ లాగా ఉండాలని, తమిళ నాట దళపతి విజయ్ కొత్త అధ్యాయం లిఖించారని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజల ఆకాంక్షలను లోతుగా అర్థం చేసుకుని, వారి విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పాలన అందించాలని ఆయన ఆకాంక్షించారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించబోతున్న విజయ్‌కు శు భాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో సింగిల్‌గా పోటీ చేసి తన స్టార్ ఇమేజ్‌ని విజయ్ నిరూపించుకున్నారన్నారు. తన సత్తా చాటుకున్నాడని చెప్పారు. ఆయనకు నమ్ముకున్న అభిమానులకు, క్యాడర్‌కు నేడు భరోసా లభించిందన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పరిపాలన తో తమిళనాడు రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పన, విద్యారంగ బలోపేతం, ఆరోగ్య సేవల మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయ సాధనలో విజయ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ముందడుగు వేయాలని బమ్మిడి దుర్యోధనరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్లోబల్ స్థాయిలో పోటీ పడే సత్తాను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించారు

మొదటిపేజీ తరువాయి

మార్పులు జరుగుతున్నాయని, వీటి ద్వారా విద్యార్థుల బలమైన భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ, తల్లి కి వందనం, మెగా పేరెంట్ టీచర్ మీట్, సమూల మార్పులతో మధ్యాహ్న భోజనం, ప్రశాంతమైన తరగతి గదులు, అత్యుత్తమ ఫలితాల సాధనకు అనువుగా రూపొందించిన పాఠ్య పుస్తకాలు, రాజకీయాలు లేకుండా రాజముద్ర తో చదువులు.. ఇది ఆంధ్రప్రదేశ్ విజన్ అని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ, ముఖ్యంగా శ్రీకాకుళం విద్యార్థులు మరింత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. దేశ స్థాయిలో రోల్ మోడల్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరోసారి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్య విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ, విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో పోటీపడగల సామర్థ్యం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని రామ్మోహన్ నాయుడు అన్నారు.

ఈ కార్యక్రమంలో డిల్లీ నుండి వర్చువల్ గా రామ్మోహన్ నాయుడు భాగస్వామ్యం అవ్వగా.. సభా కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, విద్యా శాఖ అధికారులు, విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రయాణ సమయంలో హెల్మెట్ ధారణ తప్పనిసరి




నవతరం -కాశీబుగ్గ

హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ శ్రీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కాశీబుగ్గ పట్టణంలో అభయం హెల్మెట్ ర్యాలీ నిర్వహించబడింది. కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని మూడు రోడ్ల కూడలి వద్ద అభయం హెల్మెట్ బ్యాంక్ ప్రారంభించి వాహనదారులకు హెల్మెట్లు అందజేశారు. ఈ ర్యాలీ కాశీబుగ్గ పట్టణంలోని మూడు రోడ్ల కూడలి నుండి ప్రారంభమై కె టి రోడ్డు మీదుగా ఇంద్ర చౌక్ వరకు సాగింది. అనంతరం అక్కడి నుండి మూడురోడ్లు కూడలి వరకు తిరిగి ర్యాలీ నిర్వహించి ప్రజల్లో హెల్మెట్ ,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ టి. భవాని, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది స్వయంగా హెల్మెట్ ధరించి వాహనం నడుపుతూ హెల్మెట్ యొక్క ప్రాముఖ్యత,అవసరం మరియు ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీగా సాగారు. అలాగే మూడురోడ్లు కూడలిలో ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్ ద్వారా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు తాత్కాలికంగా హెల్మెట్లు అందజేసి, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణ రక్షణ ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే ప్రధాన ఉద్దేశంతో జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి గారు 'అభయం హెల్మెట్ బ్యాంక్' కార్యక్రమాన్ని శ్రీకాకుళం పట్టణంలో తోలి దశగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు కాశీబుగ్గ--పలాస పట్టణంలో అభయం హెల్మెట్ ర్యాలీ నిర్వహించబడినట్లు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలి. ఇది కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అత్యవసర చర్య అని తెలిపారు. ప్రజలంతా హెల్మెట్ ధారణను అలవాటు చేసుకుని,రోడ్డు భద్రతకు సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు.

ఈ అవగాహన ర్యాలీలో కాశీబుగ్గ టౌన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ వై రామకృష్ణ, కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతి రావు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# స్త్రీ వాది

(మే 4-చలం వర్ధంతి)

చలంగా ప్రసిద్ధ పొందిన గుడిపాటి వెంకట చలం రచనలు చాలా వరకు స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా చేసుకునిఉంటాయి. ముఖ్యంగా సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలు, వాటిని వారు ఎదుర్కొనే విధానాలను చర్చించాడు. చలం రచనలలో ఇతివృత్తమూ, తాత్వికతా, రచనాశైలీ ఆయనకు ఆధునిక తెలుగు రచనా రంగంలో అనన్యమైన స్థానాన్ని సంపాదించి పెట్టాయి. చలం - తనమీద తానే ఒక పుస్తకాన్ని వ్రాసి (1972), దానికి "చలం" అని పేరు పెట్టారు. అదే అతని ఆత్మకథ. తన ఆత్మకథలో చలం తనతండ్రి తనను కొట్టడం గురించి వ్రాసారు, కానీ ఆయన పేరు మాత్రం వ్రాయలేదు. తన తల్లి భర్తతోను పిల్లలతోను పుట్టింటనే అవస్థ పడటం గురించి వ్రాసారు, కానీ ఆవిడ పేరు కూడారాయలేదు. (చలం ఆత్మకథలో ఇద్దరి పేర్లు లేవు). ఈ ఆత్మకథకు ముందుమాట తనే వ్రాసుకున్నారు. గుడిపాటి వెంకటచలం 1894,మే నెలలో 18న మద్రాసు నగరంలో జన్మించారు. చలం తల్లి వేంకటసుబ్బమ్మ, తండ్రి కొమ్మూరి సాంబశివరావు. అయితే తన తాతగారు గుడిపాటి వేంకటరామయ్య దత్తత తీసుకోవడంతో, ఇంటిపేరు మారి గుడిపాటి వెంకటచలంగా పేరొందారు .

చిన్నతనంలో సంధ్యావందనం వంటి ఆచారాలను నిష్టగా పాటించారు. ఉన్నత పాఠశాల చదువులు పూర్తి కాకముందే ఇతిహాస పురాణాలను క్షుణ్ణంగా చదివారు. తన తండ్రి, తల్లిని వేధించే తీరు ఆ చిన్నవాని హృదయంపై బలమైన ముద్ర వేసింది. తన చెల్లెలు 'అమ్మణ్ణి' పెళ్ళి ఆగిపోవడం కూడా స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలపైకి అతని దృష్టిని గాఢంగా మళ్ళించింది.

1911లో పిఠాపురం మహారాజా కళాశాలలో చేరారు. ఆ సమయంలో బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడు నాయకత్వంలో అక్కడ నడుస్తున్న బ్రహ్మసమాజం వైపు ఆకర్షితు డయ్యాడు. తరువాత బి.ఎ. చదువు కోసం మద్రాసు వెళ్ళాడు. అంతకు ముందే చిట్టి రంగనాయకమ్మతో చలం వివాహం జరిగింది. మద్రాసులో తాను డిగ్రీ చదువుతూనే తన భార్యను కాన్వెంట్‌లో చేర్చి, తాను కాలేజీకి వెళ్ళేటప్పుడు ఆమెను సైకిల్ పై స్కూల్లో దించేవాడు. దీనిని అంతా వింతగా చూసేవారట. మామగారైతే చలాన్ని తన ఇంటి గడపే తొక్కవద్దన్నాడు. అప్పటికి చలం భార్య వయసు 13 సంవత్సరాలు. చదువు అయిన తరువాత కాకినాడలో ట్యూటర్‌గా ఉద్యోగంలో చేరాడు. తిరిగి బ్రహ్మసమాజ ఉద్యమంలోనూ, 'రత్నమ్మ' తో స్నేహం-ప్రేమ లోనూ బిజీ అయ్యారు. టీచరుగా హోస్పేటలో పనిచేసి తిరిగి రాజమండ్రిలో టీచర్ ట్రైనింగ్ కాలేజీలో ఉద్యోగంలో చేరారు. ఆ తరువాత పాఠశాల తనిఖీ అధికారిగా పనిచేశారు.

1950 ఫిబ్రవరి 9న చలం బెజవాడలోని తన సొంత ఇంటిని అమ్మివేసి, తన కుటుంబముతో అరుణాచలం వెళ్ళిపోయాడు. అప్పటివరకు ధార్మిక విషయాలమీద విముఖత చూపిన చలం, ఒక్కసారిగా రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్ళటం చర్చనీయాంశ మయ్యింది. చలాన్ని రమణమహర్షి దగ్గరకు, అతని మిత్రుడు, సహోద్యోగి దీక్షితులు1930లలోతీసుకుని వెళ్ళారు. అప్పటి నుండి చలం అప్పుడప్పుడు రమణాశ్రమానికి వెళ్ళివస్తూండేవాడట.

ఆయన వెళ్ళిన అతికొద్ది కాలానికే రమణ మహర్షి ఇహలోక యాత్రను చాలించారు. చలం అక్కడి ప్రశాంత వాతావరణంలో కొంత ధార్మిక విషయాల మీద సాధన చేశాడు. ఎందరో మోసపోయిన స్త్రీలకు ఆశ్రయం కల్పించారు. అతని భార్య హృద్రోగంతో అరుణాచలంలోనే మరణించింది. చివరి రోజులలో అతని కూతురు సౌరిస్, ఎంతగానో సేవ చేసింది. అరుణాచలంలో మూడు దశాబ్దాలు జీవించి, 1979 మే 4 న అనారోగ్యంతో చలం మరణించారు. అతని అంత్యక్రియలు కూతురు సౌరిస్ జరిపించింది. ఆతని మరణం తరువాత కొన్ని నెలలపాటు, ఆతని రచనల గురించి దిన/వార పత్రికలలో తీవ్ర చర్చలు జరిగాయి.

చలం తన రచనలను 1920 చివరి ప్రాంతాలలో మొదలు పెట్టాడు. 1930-40లలో ఎంతో ప్రసిద్ధి చెందారు. ఏ రచయిత కూడా తెలుగులో ఇంతగా స్త్రీలగురించి వ్రాయలేదు. స్త్రీ రచయితలుకూడా, ఆయన వ్రాసినదాంట్లో సగం కూడా ఇంతవరకు వ్రాయలేకపొయ్యారు. ఆ మధ్యకాలంలో (1920-1950 మధ్య) చలం రచనలు తెలుగు నాట పెనుతుఫానులాగా ముసురుకొన్నాయి. అతని స్త్రీవాదమూ, స్వేచ్ఛా, హిపోక్రసీనెదిరించే తత్వమూ, లెక్కలేనంత మందిని అతనికి శతృవులుగామార్చాయి. చలం, శ్రీ శ్రీ వ్రాసిన మహాప్రస్థానంకు ముందుమాట వ్రాసాడు.

మహాప్రస్థానం లోని రచనలకు దీటుగా ఈ ఉపోద్ఘాతం తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధమైంది. "యోగ్యతా పత్రం" అన్న శీర్షికతో వ్రాయబడిన ఈ ముందుమాట తెలుగు రచనలలో అత్యంత ప్రసిద్ధమైనముందుమాటలలో ఒకటి. మైదానం,దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు,స్త్రీ,మ్యూజింగ్స్,విషాదం, హరిశ్చంద్ర నాటిక వంటివి చలం రచనలలో సుప్రసిద్ధమైనవి. చలం తన భావాలను వ్యక్త పరచడానికి అనేక రచనా ప్రక్రియలు వాడాడు. కథలు, నవలలు అందులో ముఖ్యమైనవి. నాటకాలు కూడా ఉన్నాయి, కానీ అందులో వ్యంగ్య నాటికలుఎక్కువ. సంప్రదాయ బంధాలను నుండి ఆధునిక ఆలోచనల వైపు స్త్రీలను మళ్ళించిన ఘనత చలంకి దక్కింది.



యం.రాం ప్రదీప్

# చెప్పులు...చెప్పుడు మాటలు..!

చెప్పుడు మాటలు
ఎవరైనా
నీ చెవి వాకిట నిలబడి
చల్లని గాలిలా
ఊదినప్పుడు...
నీవు మాత్రం
చెవిటివానిలా కాదు
చైతన్యవంతుడిలా
చిరునవ్వు నవ్వాలి...

చెవిని దాటిఆ
మాటలు
గుండె గదిలోకి
చేరితే...
ముళ్ళైమనసును
గుచ్చుతాయి,
విషపు విత్తనాలై
విశ్వాసపు నేలలో
మొలుస్తాయి...

మనమెంత
మెరిసే చెప్పులు
కొన్నా...
ముత్యాల ధర
చెల్లించినా...

ఇంటి గడప
దాటనివ్వం...
గుడి ప్రాంగణం
చేరనివ్వం...
ఎందుకంటే...
వెలుపల మురికిని
ముట్టినవి
లోపలి పవిత్రతకు
తగవు...

అలాగే...
చెప్పులైనా... చెప్పుడు
మాటలైనా...
గడప
దాటకపోతేనే
గౌరవం...
గుండె
దాటకపోతేనే
ప్రశాంతత..

ఔను
మిత్రమా
చెప్పు కాళ్లకే
అందం...
చెప్పుడు
మాట
గడపకే పరిమితం...
గుండెలో చోటిస్తే
నవ్వులు
నిశ్శబ్దమౌతాయి...
నమ్మకాలు
నిప్పులౌతాయి...
ఆప్యాయత
బూడిదవుతుంది...
అనుబంధం
ఆవిరవుతుంది...
స్నేహాలే
శ్మశానాలౌతాయి...!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

## ఖమ్మం జిల్లాలో.. కూసుమంచిలో...
## ఒక చెయ్యి... ఒక కాలు లేని శిల్పి నిర్మించిన శివాలయం




ఖమ్మం జిల్లాలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన కాకతీయ నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తున్న ప్రసిద్ధ శివాలయం కూసుమంచి శివాలయం అత్యంత ముఖ్యమైనది. ఇది వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగి కాకతీయుల శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తుంది. కాకతీయుల భక్తి భావం కళావైభవానికి ప్రత్యక్ష సాక్ష్యం కూసుమంచిలోని శివాలయం. ఈ శివాలయాన్ని గణపేశ్వరాలయంగా రామలింగేశ్వర స్వామి ఆలయంగా కూడా పిలుస్తున్నారు. క్రీస్తు శకం 11-12వ శతాబ్దంలో కాకతీయల కాలంలో వెయ్యిన్నొక్కటి శివాలయాల నిర్మాణ క్రమంలో గణపతి దేవుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి.

ఈ ఆలయంలోని శివలింగం దక్షిణ భారతదేశంలో అతిపెద్ద శివలింగాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఉత్తర దిశగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం ఓ చేయి, కాలు లేని శిల్పి చేశాడనేది ప్రచారంలో ఉంది. ఈ ఆలయాన్ని పెద్దపెద్ద బండరాళ్లతో పేర్చిన ఘనత ఆ శిల్పికే దక్కింది. ఈ ఆలయంలోని శివలింగం దక్షిణ భారతదేశంలో అతిపెద్ద శివలింగాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఉత్తర దిశగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం ఓ చేయి, కాలు లేని శిల్పి చేశాడనేది ప్రచారంలో ఉంది. ఈ ఆలయాన్ని పెద్దపెద్ద బండరాళ్లతో పేర్చిన ఘనత ఆ శిల్పికే దక్కింది. ఈ ఆలయంలోని శివలింగం దక్షిణ భారతదేశంలో అతిపెద్ద శివలింగాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఉత్తర దిశగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం ఓ చేయి, కాలు లేని శిల్పి చేశాడనేది ప్రచారంలో ఉంది. ఈ ఆలయాన్ని పెద్దపెద్ద బండరాళ్లతో పేర్చిన ఘనత ఆ శిల్పికే దక్కింది. ఆలయాన్ని పైగుండా చూస్తే నక్షత్రాకారంలో, మరోవైపు శివలింగాకారం ఉన్నట్లుగా బండరాళ్లను పేర్చి వాటిపై ఆలయాన్ని నిర్మించటం విశేషం. ఇక ఆలయంలో ఉన్న శివలింగం 6 అడుగుల ఎత్తు. 5.3 సెంమీ వ్యాసార్థంతో ప్రతిష్ఠించగా అది నున్నటి గ్రానైట్ రాయిని పోలి ఉంటుంది. శివలింగంపై ప్రతినిత్యం సూర్యోదయ సమయాన సూర్యకిరణాలు ప్రసరించేలా ఆలయాన్ని నిర్మించటం మరో విశేషం.

వందలాది సంవత్సరాల పాటు కంపచెట్లు, మట్టిదిబ్బలతో జీర్ణావస్థకు చేరింది. గ్రామంలో గొప్ప ఆలయం ఉన్నా దాన్ని ఎవరూ పట్టించుకోక పోవటంతో అది ఎలా ఉందో కూడా గ్రామస్తులకు తెలియని పరిస్థితి. నాటి కూసుమంచి సీఐగా ఉన్న వారి దృష్టికి ఆలయం విషయం రావటంతో గ్రామస్థుల సహకారంతో ఈఆలయాన్ని వెలుగులోకి తీసుకవచ్చారు. పురాతన ఆలయాన్ని అభివృద్ధి పరిచి పూజలు ప్రారంభింపజేశారు. భక్తుల చొరవతో ఈ ఆలయం క్రమంగా వెలుగులోకి వచ్చింది. ఆ తరువాత మహా ఆలయంగా వెలుగొందుతోంది. ఈ ఆలయాన్ని దర్శించటం పునర్జన్మ సుకృతంగా పెద్దలు అభివర్ణిస్తున్నారు. కూసుమంచి శివాలయాన్ని దర్శిస్తే కోరిన కోరికలు తీరుతాయనేది భక్తుల నమ్మకం. అందుకే ఈశివాలయం భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతూ.. నానాటికి దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రతి శివరాత్రికి ఖమ్మం జిల్లాతో పాటు పొరుగున ఉన్న ఉమ్మడి నల్లగొండ, వరంగల్ నుండి భక్తులు ఇక్కడికి వస్తుంటారు. ప్రతియేడు వేల మంది భక్తులు ఈ శివాలయాన్ని దర్శించుకుంటున్నారు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు



## టాక్సిక్ రొమాన్స్.. నాన్సెన్స్ అంటున్న కియరా

"టాక్సిక్ సినిమాలో కియరా అద్వానీ రెచ్చిపోయిందంట. యష్ తో కలిసి రొమాంటిక్ సన్నివేశాల్లో హద్దుదాటి నటించేసిందంట. తర్వాత చూసుకుంటే ఆ సన్నివేశాలు మరీ ఘాటుగా, పచ్చిగా ఉన్నాయంట. దీంతో ఆ ఎపిసోడ్ లో కొన్ని షాట్స్ కట్ చేయమని, రొమాన్స్ పార్ట్ తగ్గించమని మేకర్స్ ను కోరిందంట కియరా."

కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనం ఇది. ఎట్టకేలకు ఈ స్టోరీలపై కియరా స్పందించింది. ఒక్క ముక్కలో ఇదంతా నాన్సెన్స్ అని కొట్టిపారేసింది.

ఓ బాలీవుడ్ మీడియా రాసిన కథనాన్ని ట్యాగ్ చేసిన కియరా.. ఇదంతా అవాస్తవం అంటూ ఒక్క ముక్కలో స్పందించింది. కియరా పోస్టుతో ఇన్నాళ్లూ నడిచిన కథనాలకు ఫుల్ స్టాప్ పడింది.

ఈ సినిమాలో రొమాంటిక్ సన్నివేశాలపై యష్ ఇప్పటికే స్పందించాడు. ఓ మహిళ తన కోరికల్ని, భావోద్వేగాల్ని, శృంగారాన్ని ఎలా ప్రదర్శించగలదో ఈ సినిమాలో మరింత వివరంగా చూస్తారని అన్నాడు. స్త్రీ చూపించే ఆ భావాలు పూర్తిగా భిన్నమైనవని అన్నాడు.

గీతూమోహన్ దాస్ దర్శకత్వంలో కన్నడ-ఇంగ్లిష్ భాషల్లో తెరకెక్కింది టాక్సిక్ సినిమా. ఇప్పటికే 2 సార్లు వాయిదా పడిన ఈ సినిమాను తాజాగా మరోసారి వాయిదా వేశారు. కామిక్ కాన్ లో వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకొని, అంతర్జాతీయ స్థాయిలో మరింత భారీ ఎత్తున సినిమాను విడుదల చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

## అంతా కలిసి వచ్చే వేసవిపై పడ్డారు

గతేడాది వేసవిని అంతా కలిసి ఎండబెట్టారు. ఒక్కటంటే ఒక్క సక్సెస్ లేదు. చూస్తుంటే, ఈ ఏడాది సమ్మర్ కూడా డ్రైగానే ముగిసేలా ఉంది. కానీ వచ్చే ఏడాది సమ్మర్ బాక్సాఫీస్ మాత్రం రంజుగా ఉంది. ఒకటి కాదు, రెండు కాదు, 4 పెద్ద సినిమాలు సమ్మర్ ఎట్రాక్షన్ గా రాబోతున్నాయి.

తాజాగా బాలకృష్ణతో సినిమా ప్రకటించాడు కొరటాల. త్వరలోనే ఈ ప్రాజెక్టును సెట్స్ పైకి తీసుకొచ్చి, వచ్చే ఏడాది వేసవి కానుకగా ప్రేక్షకులకు అందించాలని ఫిక్స్ అయ్యాడు. తాజాగా నిర్మాత మిక్కిలినేని సుధాకర్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు.

అయితే బాలయ్య-కొరటాల సినిమా కంటే ముందే వచ్చే ఏడాది వేసవికి కొన్ని సినిమాలు షెడ్యూల్ అయి ఉన్నాయి. అందులో ముఖ్యమైంది వారణాసి.

మహేష్-రాజమౌళి కాంబోలో తెరకెక్కుతున్న ఈ ఇంటర్నేషనల్ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల చేయాలని నిర్ణయించారు.

సమ్మర్ కే రాబోతోంది. సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయబోతున్నారు. ప్రస్తుతం సినిమా సెట్స్ పై ఉంది.

ఇక చాన్నాళ్లుగా నలుగుతున్న డ్రాగన్ మూవీని కూడా వచ్చే ఏడాది వేసవికి పోస్టుపోన్ చేసిన సంగతి



తెలిసిందే. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను జూన్ 11న థియేటర్లలోకి రాబోతున్నట్టు తెలిపారు. ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన ఈ సినిమా, వచ్చే ఏడాది సమ్మర్ కు పక్కా అంటున్నారు.

సో.. చూస్తుంటే, 2027 వేసవి ఇండియన్ సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ సమ్మర్ బాక్సాఫీస్ వార్ గా మారబోతోంది. అయితే ఇంతకుముందే చెప్పుకున్నట్టు ఈ ఏడాదిలో ఎన్ని మార్పులు జరుగుతాయో.. ఎన్ని సినిమాలు వాయిదా పడతాయో.. ఇంకెన్ని సినిమాలు కొత్తగా వచ్చి చేరుతాయో చెప్పలేం. టాలీవుడ్ లో ఏదీ ప్లానింగ్ ప్రకారం జరగదు కదా.

## నువ్వు తాగేది మందు కాదు...
# నీ కుటుంబం రక్తం




రాత్రి పది గంటలు. చిన్న ఇల్లు. వెలుతురు మసకబారుతోంది. బయట వర్షం పడుతోంది. లోపల లక్ష్మి కిటికీ దగ్గర నిలబడి ఉంది. చేతిలో మొబైల్... మళ్లీ మళ్లీ కాల్ చేస్తోంది. "స్విచ్ఛ్ ఆఫ్..." ఆమె కళ్లలో ఆందోళన. లోపల చిన్న బాబు "అమ్మ... నాన్న ఎక్కడ?" అని అడుగుతున్నాడు. ఆ నాన్న పేరు రాజు.
ఒకప్పుడు రాజు మంచి మనిషి. కష్టపడి పని చేసే వాడు. పెళ్లి అయ్యాక మొదట్లో అన్నీ బాగానే ఉన్నాయి. కానీ క్రమంగా అతని జీవితంలోకి గుట్కా, సిగరెట్, తర్వాత మద్యం వచ్చాయి. "స్నేహితులతో టైమ్ పాస్" అంటూ మొదలైనవి... నెమ్మదిగా అలవాటయ్యాయి. ఒక రోజు లక్ష్మి అతని చేతిలో ఉన్న గ్లాస్‌ని చూసి "ఇది అంత అవసరమా?" అని అడిగింది. రాజు నవ్వుతూ "ఇది చిన్న విషయం... రిలాక్స్ అవ్వడానికి మాత్రమే" అన్నాడు. కానీ ఆ "చిన్న విషయం" రోజురోజుకీ పెరిగింది. చివరకు అది అలవాటు కాదు, అతని జీవితాన్ని తినే వ్యాధిగా మారింది.
మొదట లక్ష్మి "ఇవి వదిలేయ్" అని మృదువుగా చెప్పేది. తర్వాత ఏడ్చేది. తర్వాత కోపపడేది. చివరికి మౌనంగా మారిపోయింది. రాజు జీతం తీసుకొచ్చిన రోజే, సగం డబ్బు మద్యం దుకాణాల్లో పోయేది. ఆ గ్లాస్‌లో పడేది మందు కాదు... లక్ష్మి కన్నీళ్లు, పిల్లాడి భవిష్యత్తు. ఇంటికి మిగిలేది తక్కువ. పిల్లాడి స్కూల్ ఫీజు ఆలస్యం. ఇంట్లో గొడవలు. ఆరోగ్యం క్షీణించింది. దగ్గు, అలసట... అయినా అతను ఆపలేకపోయాడు.
ఒక రాత్రి ఇదేలా వర్షం పడుతున్న సమయంలో రాజు బయట రోడ్డుపై మత్తులో కూలిపోయాడు. పక్క వాళ్లు ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ చెప్పిన మాటలు అతని గుండెల్లో గుచ్చుకున్నాయి: "ఇంకా ఇలా కొనసాగితే... నువ్వు తాగేది మందు కాదు... నిన్ను నమ్మిన వాళ్ల రక్తం." లక్ష్మి కళ్లలో నీళ్లు. బాబు తండ్రి చేతిని పట్టుకుని "నాన్న... నువ్వు మమ్మల్ని వదిలిపోతావా?" అని అడిగాడు. ఆ ఒక్క మాట రాజు మనసును పూర్తిగా కుదిపేసింది.
ఆ రోజు రాజు అద్దం ముందు నిలబడి తనని తాను చూసుకున్నాడు. "నేను తాగేది నిజంగా మందేనా? లేక నా భార్య ఆశలేనా? నా పిల్లాడి భవిష్యత్తేనా?" అని తనని తాను ప్రశ్నించుకున్నాడు. అతనికి అర్థమైంది ప్రతి గ్లాస్‌లో అతను తాగింది మద్యం కాదు... తన కుటుంబం జీవితం.
కొన్ని రోజుల తర్వాత ఆసుపత్రి బయట బెంచ్ మీద కూర్చున్న రాజు, తన పక్కన ఉన్న ఓ వృద్ధుడితో మాట్లాడాడు. ఆ వృద్ధుడు చెప్పిన మాటలు అతని ఆలోచనలను మార్చేశాయి: "లాభాలు కంపెనీలకు... ప్రభుత్వానికి పన్నుల రూపంలో డబ్బు. కానీ నష్టాలు నీలాంటి వాళ్లకి... వారి కుటుంబాలకు... దేశ ఆరోగ్యానికి. పూర్తిగా ఆపలేకపోవడానికి కారణాలు కూడా ఉన్నాయి. బ్యాన్ చేస్తే దొంగ మార్కెట్, క్రైమ్ పెరుగుతుంది; లక్షలాది మంది ఉద్యోగాలు పోతాయి; రైతులు నష్టపోతారు; ప్రభుత్వ ఆదాయం తగ్గిపోతుంది; అమలు చేయడం కష్టం. అందుకే పూర్తిగా ఆపలేకపోతున్నారు. కానీ నిన్ను ఆపేది ప్రభుత్వం కాదు... నువ్వే."
ఆ మాటలు రాజు మనసులో నాటుకుపోయాయి. ఆ రోజు నుంచే అతను మానేయాలని నిర్ణయం తీసుకున్నాడు. మొదటి రోజులు చాలా కష్టంగా గడిచాయి. చేతులు వణికాయి, కోపం వచ్చింది, తట్టుకోలేకపోయాడు. కానీ ప్రతి సారి అతని బాబు ముఖం, లక్ష్మి కన్నీళ్లు గుర్తొచ్చాయి. "ఈ గ్లాస్... నా కుటుంబం రక్తం" అని తనకి తానే గుర్తు చేసుకున్నాడు. కొద్ది వారాల్లో కొంచెం మెరుగయ్యాడు. కొన్ని నెలల్లో పూర్తిగా మానేశాడు.
ఇప్పుడు రాజు అదే ఊరిలో ఇంకొక పని చేస్తున్నాడు. మద్యం, గుట్కా, గంజాయి వాడుతున్న వాళ్ల దగ్గరకు వెళ్లి ఒకే మాట చెబుతున్నాడు: "నువ్వు తాగేది మందు కాదు... నీ కుటుంబం రక్తం. నీకు నువ్వు నష్టం చేసుకుంటే పరవాలేదు... కానీ నిన్ను నమ్మిన వాళ్ల జీవితాన్ని నాశనం చేయకు." కొందరు నవ్వారు, కొందరు పట్టించుకోలేదు. కానీ ఒకరు మారారు, తర్వాత ఇంకొకరు... నెమ్మదిగా మార్పు మొదలైంది.
"ఈచ్ వన్ టీచ్ వన్" ఇప్పుడు ఒక జీవితం కాపాడే నినాదంగా మారింది. ఒకడు మానితే ఒక కుటుంబం నిలుస్తుంది. ఈ కథలో నిజం ఒక్కటే: నువ్వు పడిపోతే ప్రపంచం ఆగదు, కానీ నీ కుటుంబం మాత్రం కూలిపోతుంది. పెళ్లి అంటే బాధ్యత, భార్య అంటే నమ్మకం, పిల్లలు అంటే భవిష్యత్తు.
ఇప్పుడే ఆలోచించు "నేను తాగేది నిజంగా ఏమిటి?" ఇప్పుడే నిర్ణయం తీసుకో. నీ కోసం కాదు... నిన్ను నమ్మిన వాళ్ల కోసం. మానేయి. మార్పు మొదలు పెట్టు. మరి... ఒకరిని కూడా మార్చు.
మీరందరూ మారాలి అని ఆశిస్తూ "నీ చేతిలో ఉన్న గ్లాస్... నీ కుటుంబం భవిష్యత్తు."

**కలం తో మార్పు:**
**తేరాల రాజేంద్రప్రసాద్ గుప్తా**
**బాబు జగ్జీవన్ రామ్ నగర్**
**హైదరాబాద్ - 500037**

# ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థి పొదుపు నేర్చుకోవాలి

**నవతరం-లావేరు**



ప్రాథమిక స్థాయి నుండి ప్రతి విద్యార్థి పొదుపు నేర్చుకోవాలని రిసోర్స్ పర్సన్ పోస్ట్ మాస్టర్ లక్ష్మీ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం లావేరు శాఖా గ్రంథాలయములో పోస్ట్ ఆఫీసులో ఉండే ఎస్బీ,ఆర్డీలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. సుకన్య సమృద్ధి యోజన పథకము లో గురించి తెలియజేశారు. అలాగే ఏటీఎం కార్డు, ఆధార్ కార్డ్,పాన్ కార్డ్, ఫోన్ పే గూగుల్ పే గురించి వివరంగా విద్యార్థులకు తెలిపారు. నేటి పొదిపే రేపటి భవిష్యత్తు అని విద్యార్థులు తల్లిదండ్రులు కూడా విద్యార్థులతో పొదుపు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళంలో ఘనంగా సాగిన అరుణోదయ రామారావు 7వ వర్ధంతి సభ

# విప్లవ సాంస్కృతోద్యమ ధ్రువతార రామారావు






**నవతరం- శ్రీకాకుళం**
మంగళవారం శ్రీకాకుళం టౌన్ క్రాంతి భవనంలో అరుణోదయ సాంస్కృత సమైక్య శ్రీకాకుళం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కామ్రేడ్ అరుణోదయ రామారావు అన్న ఏడవ వర్ధంతి సభ విప్లవ నినాదాల మధ్య ఘనంగా సాగింది. అరుణోదయ జిల్లా అధ్యక్షులు సొర్ర రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ ప్రజా సాంస్కృతిక ఉద్యమ ధ్రువతారగా అరుణోదయ రామారావన్న నిలిచాడని కొనియాడారు. నాలుగు దశాబ్దాలు ప్రజల పక్షాన ప్రజా ఉద్యమాలలో తన గళాన్ని కలాన్ని సాహిత్య రంగంలో ప్రజా ఉద్యమాల వైపు నిలబడ్డాడని అందుకే ఆయన అరుణోదయ సంస్థ పేరుగా చరిత్ర ప్రసిద్ధిగాంచాడని అన్నారు .ప్రజా కళల కోసం పరితపించిన రామారావన్న లేని లోటును పూడ్చుకోలేనిదని ఆవేదన చెందారు. కార్పొరేట్ హిందూ మతోన్మాద ఫాసిజం ప్రమాదం పొంచి ఉన్న వర్తమాన కాలంలో రామారావు అన్న లేని లోటు తీరనిదని మాధవరావు అన్నారు . శ్రీకాకుళ ఉద్యమంతో ఆయనకి నాలుగు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ఇక్కడి అమరుల సభలకు, కాకరాపల్లి ఉద్యమ కేంద్రాల్లో రామారావన్న స్వయంగా పాల్గొని తన గలం ద్వారా పల్లెలను ఉత్తేజపరిచారని అన్నారు .అనేక పాటలను పాడారని గుర్తు చేశారు. ఇంకా ఈ సభలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి దానేష్, అరుణోదయ జిల్లా కార్యదర్శి కె. సోమేశ్వరరావు, ఐఎఫ్టియు నాయకులు కృష్ణవేణి, జుత్తు వీరస్వామి ఏఐకేఎంఎస్ నాయకుల గొరకల బాలకృష్ణ , పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి . కుసుమ, ఆర్. మాధవరావు, మామిడి భీమారావు, నేతింటి నీలం రాజు, సార జగన్ తదితరులు పాల్గొన్నారు.

# పాలిసెట్‌లో న్యూ బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే విజేతలు

**నవతరం-టెక్కలి**
ఏప్రిల్ 25వ తేదీన రాష్ట్ర వ్యాప్తం గా నిర్వహించిన పాలిసెట్ ఫలితాల్లో టెక్కలి న్యూ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్టేట్ ర్యాంక్ లు సాధించారని డైరెక్టర్ దేవాది శ్రీనివాస రావు తెలిపారు. ఉత్తమ ర్యాంక్ లు సాధించిన విద్యార్థుల వివరాలు. రొక్కం రష్మిక సంతోషి 114 మార్కులతో స్టేట్ 440 ర్యాంక్, సకలభక్తుల భరత్ 113 మార్కులతో 594 ర్యాంక్, గాడి శరణ్య 110 మార్కులతో 851 వ ర్యాంక్, తమ్మినేని సాయికుమార్ 110 మార్కులతో 916 ర్యాంక్, యస్ వెంకట శ్రీపాధ్ 107 మార్కులతో 1264 ర్యాంక్, నెయ్యిల ఉదయ్ కుమార్ 105 మార్కులతో 1697వ ర్యాంక్, యమ్ మురళి కృష్ణ 100 మార్కులతో 2729 ర్యాంక్ అలాగే అంజంగి శివహరీష్ 3034, బగాది మౌనిక 3227, దివ్వల నిఖిత 3475, కుమ్మరి మణికంఠ 3475, టొంప లోహిత్ 4261 వ ర్యాంక్ 5000 లోపు స్టేట్ ర్యాంక్ లు సాధించినట్లు ఆయన తెలియజేశారు.. 118 పరీక్షకు హాజరు కాగా వీళ్లలో 113 మంది అర్హత సాధించారని, ఉత్తమ స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు అందరూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కావడం విశేషం అని ఆయన తెలియజేశారు.



## సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

# అలరించిన జక్కువ అవంతిక నృత్యాలు



**నవతరం-నరసన్నపేట**

జలుమూరు మండలం, టి.లింగాలపాడు గ్రామంలో శ్రీ కాత్యాయని సహిత వటలింగేశ్వర స్వామి ప్రతిష్టాపన మహోత్సవం సందర్భంగా, స్వామి వారి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగముగా పోలాకి గ్రామానికి చెందిన శ్రీ సాయి నటరాజ నృత్యానికేతన్ గురువులు జక్కువ. అవంతిక బృందం పాల్గొని, నాట్య నృత్యాలలో ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా అవంతిక మాట్లాడుతూ శ్రీ కాత్యాయని సహిత వటలింగేశ్వర స్వామి ప్రాంగణంలో మా బృందాన్ని భాగం చేయటం ఆనందంగా ఉందని, కళలకు ప్రొత్సాహాన్నందించాలని, భారతీయ సాంసృతిక కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తే, ఎంతో మంది నాట్యకారులకు ఒక వేదిక దొరుకుతుందన్నారు. కళాకారులకు నగదు, బహుమతులు, సన్మానాలు ముఖ్యం కాదని, మీరు అందించే ప్రొత్సాహం, చప్పట్ల ధ్వనిలే మాకు అసలైన బహుమతులన్నారు. సిద్ధిగణపతి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మేధా దక్షిణామూర్తి, చండీశ్వర నందీశ్వర, నవగ్రహ, నాగబంధ, కాత్యాయనీ సహితవట లింగేశ్వర స్వామి ప్రతిష్టాపన మహోత్సవములో, మాకు ఇంత మంచి అవకాశం కల్పించిన ఆలయ కమిటీ సభ్యుల బృందానికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు.

# భద్రమహంకాళి, గురిటిపోలమ్మవార్లను దర్శించుకున్న మాజీమంత్రి ధర్మాన

**నవతరం- శ్రీకాకుళం**



అమ్మవారి వారోత్సవాల్లో భాగంగా ఇల్లీసుపురం భద్రమహంకాళి అమ్మవారు, మండలవీధి గురిటిపోలమ్మవారిని రెవెన్యూ మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం దర్శించకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ.పద్మావతి,ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**